మూసీ మోసం గుట్టు రట్టు

మొదటిపేజీ తరువాయి...

ఎమ్మెల్సీ కవిత, సర్కారు అసలు రంగును బయటపెట్టారు. అసలు డీపీఆర్ తయారే కాలేదని ఇన్ని రోజులూ చెప్పుకొచ్చిన ప్రభుత్వం, ప్రపంచ బ్యాంకుకు ఇచ్చిన నివేదికలోనే డీపీఆర్ సిద్ధమైందని అంగీకరించడం సంచలనం కలిగిస్తున్నది. కాంగ్రెస్ సర్కార్ వచ్చీరాగానే మూసీని ఉద్ధరించడానికేనంటూ బిల్డప్ ఇచ్చి 'సుందరీకరణ ప్రాజెక్టు'ను భుజానికెత్తుకోవడం వెనుక 'దాల్‌మే కుచ్ కాలాహై!' అన్న అనుమానాలకు తాజా పరిణామాలు మరింత బలం చేకూర్చాయి.



- సీఎం ఓ సారి మూసీ సుందరీకరణ అంచనా వ్యయం లక్షన్నర కోట్లు అంటారు! మరోసారి 'అసలు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధమే కాలేదు, అంచనా వ్యయం ఎక్కడిది?' అంటారు!!
- స్వయానా ఉప ముఖ్యమంత్రి 'ఇదిగో డీపీఆర్ సిద్ధమైంది' అని పవిత్రమైన శాసనసభలో ఓ పుస్తకాన్ని చూపుతూ ప్రకటన చేస్తారు! అదే అసెంబ్లీ వేదికగా మరో మంత్రి మాత్రం 'డీపీఆర్ ఇంకా తయారు కాలేదు, ప్రాథమిక దశలోనే ఉన్నది' అని సెలవిస్తారు!!
- రాష్ట్ర ప్రభుత్వమే ప్రపంచ బ్యాంకుకు ఇచ్చిన పీపీఆర్ (ప్రిలిమినరీ ప్రాజెక్టు రిపోర్టు)లో డీపీఆర్ సిద్ధంగా ఉన్నదని లిఖితపూర్వకంగా ఒప్పుకుంటుంది! ఇదే ప్రభుత్వం ఆ తర్వాత డీపీఆర్ రూపకల్పన కోసం ఏకంగా రూ.161 కోట్లతో సింగపూర్ కన్సల్టెంట్‌కు బాధ్యతలు అప్పగిస్తూ జీవో జారీ చేస్తుంది!!
- మూసీ సుందరీకరణలో భాగంగా ప్రభుత్వమే 175 నిరుపేదల ఇండ్లను కూల్చింది! ఇదే ప్రభుత్వం ఓ అడుగు ముందుకేసి మూసీ సుందరీకరణ డీపీఆర్ సిద్ధం కాలేదని శాసనమండలిలో లిఖితపూర్వకంగా తేల్చింది.

అంచనా వ్యయంతోనే గందరగోళం

వాస్తవానికి మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై ప్రభుత్వ పెద్దలు చేసిన అంచనా వ్యయం ప్రకటనలతోనే గందరగోళం.. ముఖ్యంగా సర్కారు దాపరికం వెనక అనుమానాలు మొదలయ్యాయి. పార్లమెంటు ఎన్నికల ప్రచారం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి భువనగిరిలో మాట్లాడుతూ రూ.50 వేల కోట్ల అంచనా వ్యయంతో మూసీ సుందరీకరణ ప్రాజెక్టు చేపడుతున్నట్టు ప్రకటించారు. ఆపై పక్షం రోజుల్లోనే రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఓ కార్యక్రమంలో రూ.71 వేల కోట్ల అంచనా వ్యయంతో మూసీ సుందరీకరణ ప్రాజెక్టు చేపడుతున్నట్టు చెప్పారు. ఆపై మే చివర్లో మెయిన్‌హార్ట్ ప్రతినిధుల బృందం మూసీ ప్రాజెక్టుపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇచ్చినట్టు తెలిసింది. జూలై 28న గోపనపల్లి ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏకంగా లక్షన్నర కోట్ల అంచనా వ్యయంతో మూసీ సుందరీకరణ ప్రాజెక్టును చేపడుతున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి కుండబద్దలు కొట్టారు.

అసెంబ్లీ వేదికగా తలోమాట

మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అంచనా వ్యయంతో మొదలైన గందరగోళం అసెంబ్లీ లోనూ కొనసాగింది. ఏకంగా అసెంబ్లీ వేదికగానే తలోమాట మాట్లాడటం తెలంగాణ ప్రజలను నివ్వెరపరిచింది. ఈ ఏడాది జూలై నెలాఖరులో జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మూసీ సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధంగా ఉన్నదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. దీంతో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ అంశాన్ని లేవనెత్తి, ప్రభుత్వాన్ని నిలదీశారు. లక్షన్నర కోట్ల అంచనా వ్యయంతో ఏం చేయబోతున్నారంటూ ప్రశ్నించారు. ఇవే సమావేశాల్లో ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ డీపీఆర్ సిద్ధం కాలేదని, ప్రాథమిక దశలోనే ఉన్నదని దశలవారీగా నిధులు వెచ్చిస్తామని సెలవిచ్చారు.

టెండర్లలోనే గోల్‌మాల్

మూసీ డీపీఆర్‌ను రూపొందించేందుకు టెండర్లను ఎంఆర్‌డీసీఎల్ జూన్ మొదటి వారంలో పిలిచింది. అదే నెల 24న బిడ్ల దాఖలు గడువు పూర్తయింది. జూలై 5న ప్రైస్ బిడ్లను తెరవగా ఎల్-1గా సాయి కన్సల్టెన్సీ ఎంపికైంది. కానీ ఎంఆర్‌డీసీఎల్ అధికారులు దీన్ని అధికారికంగా ప్రకటించలేదు. జూలై 7న ప్రజాభవన్‌లో తెలంగాణ, ఏపీ సీఎంల సమావేశం జరిగింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం హుటాహుటిన 2024, జూలై 20న జీవో ఆర్టీ నంబర్ 325ని జారీ చేసి కన్సల్టెన్సీ టెండర్ల పరిశీలనకు సాంకేతిక కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ సాయి కన్సల్టెన్సీకి ఎంపికైన టెండర్లను రద్దుచేసి, కొత్త టెండర్లు పిలిచేందుకు నిర్ణయించింది. ఈ మేరకు రెండోసారి టెండర్లు పిలిచి రోజు ల్లోనే మెయిన్‌హార్ట్ సింగపూర్ ప్రైవేట్ లిమిటెడ్ కన్సార్షియంకు మూసీ మాస్టర్‌ప్లాన్ బాధ్యతల అప్పగింతకు నిర్ణయించింది. ఆపై రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 4న రూ.161 కోట్ల వ్యయంతో మెయిన్‌హార్ట్ కన్సార్షియంకు బాధ్యతలు అప్పగిస్తూ జీవో జారీ చేసింది. మరునాడే ఆ కన్సార్షియంకు ఎంఆర్‌డీసీఎల్ అంగీకార పత్రం ఇచ్చారు.

టెండర్ల దశలోనే ప్రపంచబ్యాంకుకు..

ఇక్కడో విచిత్రమైన విషయం ఏందంటే మూసీ ప్రాజెక్టుకు సంబంధించిన మాస్టర్‌ప్లాన్ బాధ్యతల అప్పగింతపై టెండర్లు కొనసాగుతున్న సమయంలోనే రేవంత్ ప్రభుత్వం ప్రపంచ బ్యాంకుకు ప్రాథమిక ప్రాజెక్టు నివేదిక (పీపీఆర్)ను ఇవ్వడం గమనార్హం. కన్సల్టెన్సీని ఎంపిక చేయకముందే సెప్టెంబరు 19న పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి పేరిట ఈ నివేదికను ప్రపంచ బ్యాంకుకు పంపారు. అందులో డిసెంబరులోనే ఈ ప్రాజెక్టు మొదలవుతుందని, ఈ మేరకు రూ.4100 కోట్ల రుణం కావాలని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.1,763 కోట్లు జత చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యంగా 20వ కాలంలో మూసీ ప్రాజెక్టుకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) ఉన్నది అని ప్రభుత్వమే అంగీకరించింది. ఓవైపు టెండర్లు కొనసాగుతుండగా మరోవైపు డీపీఆర్ ఉన్నదని ప్రభుత్వం పీపీఆర్‌లో పొందుపరచడమంటే ప్రపంచబ్యాంకుకు తప్పుడు సమాచారాన్ని ఇవ్వడమేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 19న ప్రపంచ బ్యాంకుకు ఇచ్చిన పీపీఆర్‌లో మూసీ డీపీఆర్ ఉన్నదని ప్రభుత్వం అంగీకరించగా ఆ తర్వాత అక్టోబర్ 17న సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయం ప్రెస్‌మీట్‌లో డీపీఆర్ సిద్ధం కాలేదని ప్రకటించారు.

లండన్ పర్యటనతో మొదలు..

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన నెల వ్యవధిలోనే మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై గురి పెట్టింది. జనవరిలోనే సీఎం రేవంత్‌రెడ్డి లండన్‌లో పర్యటించారు. థేమ్స్ నది ఒడ్డున పర్యటించి మూసీని కూడా ఇలా అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. ఫిబ్రవరి 2న చంద్రబాబు అమరావతి గ్రాఫిక్స్ రూపకర్త ఈశ్వరన్‌కు చెందిన సింగపూర్ కన్సల్టెన్సీ 'మెయిన్‌హార్ట్' ప్రతినిధి బృందం సీఎం రేవంత్‌రెడ్డిని సచివాలయంలో కలిసింది. ఈ సందర్భంగా మూసీ ప్రాజెక్టుపై చర్చ జరిగింది.

అసెంబ్లీ సాక్షిగా మూసీపై అబద్ధాలు

- డీపీఆర్ లేదని సీఎం, మంత్రుల బుకాయింపు
- డీపీఆర్ ఉన్నదని వరల్డ్ బ్యాంకుకు రిపోర్టు
- రుణం కోసం ప్రపంచ బ్యాంకు ముందు సర్కారు మోకరిల్లు
- ఆధారాలున్నా తప్పులు చెప్తున్నరు
- సర్కారుకు సభాహక్కుల నోటీసు
- చిత్తశుద్ధి ఉంటే శ్వేతపత్రం విడుదల చేయాలి
- ఎమ్మెల్సీ కవిత డిమాండ్

అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో సత్యవతి రాథోడ్

> మూసీ డీపీఆర్‌కు సంబంధించి అన్ని ఆధారాలు ఇచ్చినా మంత్రి శ్రీధర్‌బాబు అది అవాస్తవమని సభలో ఎందుకు అబద్ధం చెప్తున్నరు? మూసీపై రూ.10 వేల కోట్లతో బ్రిడ్జి నిర్మిస్తామని ప్రపంచ బ్యాంకుకు చెప్పిన ప్రభుత్వం, ప్రజలను ఎందుకు తప్పుదోవ పట్టిస్తున్నది? ఇప్పటికే 16 వేల పేదల ఇండ్లకు మార్కింగ్ చేసి బుల్డోజర్లను పంపేందుకు సర్కార్ సిద్ధమైంది. నిజంగా చిత్తశుద్ధి ఉంటే కూలగొట్టే ఇండ్ల విషయం, ప్రాజెక్టు వల్ల కలిగే లాభాలు, ఇచ్చే పరిహారంపై విడమరిచి చెప్పాలి. -ఎమ్మెల్సీ కవిత

> మూసీపై కేంద్రానికి ఓ మాట.. ప్రపంచ బ్యాంకుకు మరోమాట.. అసెంబ్లీకి ఇంకోమాట చెప్తున్నరు.. ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చేదాకా పేదల తరఫున పోరాడుతం. మూసీ పేరిట పేదల జీవితాలతో ఆటలాడుకుంటున్న ప్రభుత్వం, అత్యంత పవిత్రమైన అసెంబ్లీలో తప్పుడు సమాచారమివ్వడం దుర్మార్గం. సర్కారు వైఖరిని నిరసిస్తూ శాసనమండలిలో సభా హక్కుల నోటీసులు ఇచ్చినం. ఇప్పటికైనా సభకు వాస్తవాలు చెప్తుందని ఆశిస్తున్నం. -ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తేతెలంగాణ): మూసీ ప్రాజెక్టుపై అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చి అబద్ధాలు చెప్తున్నదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. ఈ ప్రాజెక్టు డీపీఆర్ తయారు చేయలేదని మంత్రి శ్రీధర్‌బాబు సభకు తప్పుడు సమాచారమిచ్చారని ఆరోపించారు. ఆధారాలున్నాయని గట్టిగా అడిగితే ప్రపంచ బ్యాంకుకు ప్రతిపాదనలు పంపించామని ఒప్పుకుంటూనే డీపీఆర్ రూపొందించలేదని మళ్లీ బుకాయించారని దుయ్యబట్టారు. ప్రపంచబ్యాంకు చీకటి కుట్రలు తెలుసుగనుకనే కేసీఆర్ పదేండ్లలో ఏనాడూ వరల్డ్‌బ్యాంకు నుంచి రుణం తీసుకోలేదని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే తెలంగాణను ప్రపంచబ్యాంకుకు తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. మూసీ పరీవాహక ప్రాంతంలోని పేదల భూములు గుంజుకొని రియల్ ఎస్టేట్ కోసమని ప్రభుత్వం ప్రిలిమినరీ ప్రాజెక్ట్ రిపోర్ట్ పేరిట వరల్డ్ బ్యాంకుకు డీపీఆర్ సమర్పించిందని చెప్పారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 19న సమర్పించిన డీపీఆర్ కాపీతో పాటు అక్టోబర్ 4న మ్యాన్ హార్ట్ కన్సల్టెన్సీ, కుష్మన్ అండ్ వేక్ ఫీల్డ్ ఇండియా, ఆర్‌ఐవోఎస్ డిజైన్స్ సంస్థలతో కూడిన కన్సార్షియానికి రూ.165 కోట్లు విడుదల చేసిందని మీడియాకు కవిత ఆధారాలు చూపారు. ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, శంభీర్‌పూర్ రాజుతో కలిసి ఆమె బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. మూసీ ప్రాజెక్టు డీపీఆర్‌కు సంబంధించి అన్ని ఆధారాలు ఇచ్చినా అది అవాస్తవమని సభలోనే మంత్రి శ్రీధర్‌బాబు కొట్టేయడం విడ్డూరమని, ఈ ప్రభుత్వం ఎందుకు అబద్ధాలు చెప్తున్నదని ప్రశ్నించారు. మూసీపై రూ.10 వేల కోట్లతో బ్రిడ్జి నిర్మిస్తామని ప్రపంచ బ్యాంకుకు చెప్పిన ప్రభుత్వం, ప్రజలను మాత్రం తప్పుదోవపట్టిస్తున్నదని దుయ్యబట్టారు. మూసీ విషయంలోనే కాకుండా తెలంగాణ ఆనవాళ్లను చెరిపేసేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని కవిత నిప్పులు చెరిగారు. ఇందులో భాగంగానే తెలంగాణ తల్లి ముసుగులో కాంగ్రెస్ మాతను తెచ్చిందని విమర్శించారు. ప్రాజెక్టుపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చేదాకా పేదల తరఫున పోరాడుతామని స్పష్టంచేశారు.

మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులివ్వండి

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని కవిత డిమాండ్ చేశారు. ఈ ఏడాది కేంద్రం ఫైనాన్స్ కమిషన్ నుంచి రూ.2,819 కోట్లు ఇచ్చిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభలో చెప్పారని, మరీ ఇన్ని నిధులు వస్తే సర్పంచుల బిల్లులు ఎందుకివ్వడంలేదని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు రూ.10 వేల కోట్లు చెల్లించిన ప్రభుత్వం, గ్రామాలను అభివృద్ధి చేసిన చిన్న సర్పంచులను గోస పెట్టడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. ఈ విషయంపై సభలో బీఆర్‌ఎస్ నిలదీస్తున్నా సర్కారులో చలనం లేకపోవడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఫైనాన్స్ కమిషన్ నిధుల్లో కేవలం రూ.500 కోట్లు గ్రామాలకు విడుదల చేసి మిగిలిన నిధులను దారి మళ్లించారని విమర్శించారు.

సభలోనైనా వాస్తవాలు చెప్పాలి..

అత్యంత పవిత్రమైన అసెంబ్లీలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు మూసీ ప్రాజెక్టుపై తప్పుడు సమాచారం ఇవ్వడం దుర్మార్గమని కవిత మండిపడ్డారు. సర్కారు వైఖరిని నిరసిస్తూ శాసనమండలిలో సభా హక్కుల నోటీసులు ఇచ్చామని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం సభకు వాస్తవాలు చెప్తుందని ఆశిస్తున్నామని, లేదంటే ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు.

మూసీ మాటున దందా: వివేకానంద

కేసీఆర్ తన పదేండ్ల పాలనలో వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు, ప్రైవేట్ వ్యక్తులను తెలంగాణ వైపు రాకుండా రాష్ర్టాన్ని సుభిక్షంగా పాలించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గుర్తుచేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ హైడ్రా, మూసీ విషయంలో ప్రభుత్వం పూటకోమాట మాట్లాడుతున్నదని విమర్శించారు. మూసీ డీపీఆర్‌ను ఇంకా సిద్ధం చేయలేదని చెప్తూనే ప్రపంచ బ్యాంకుకు రూ.4 వేల కోట్ల రుణం కావాలని దరఖాస్తు ఎలా పెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది ముమ్మాటికీ లోపాయికారి ఒప్పందమని, మూసీ మాటున రియల్ ఎస్టేట్ దందా అనేది స్పష్టమవుతున్నదని, మూసీ ప్రక్షాళన అనేది కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

పంచాయతీల పెండింగ్ బిల్లులు ఇప్పించండి

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): పంచాయతీల పెండింగ్ బిల్లులను ఇప్పించి తాజా మాజీ సర్పంచులను ఆదుకోవాలని తెలంగాణ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని కోరారు. ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, నవీన్‌రెడ్డి నేతృత్వంలో బుధవారం మండలిలో గుత్తాను కలిసి వినతి పత్రం అందజేశారు. 2019-24 ఏండ్ల మధ్య ప్రభుత్వ సూచనలు, ఆదేశాల మేరకు పంచాయతీల పరిధిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీకి రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు బిల్లులు బకాయి ఉన్నట్టు తెలిపారు. తాజా మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించేలా చొరవ తీసుకోవాలని మండలి చైర్మన్‌ను ఆయన కోరారు.

రెవెన్యూ రివర్స్

మొదటిపేజీ తరువాయి...

స్పష్టం చేశారు. దీంతో గ్రామాల్లో మళ్లీ రాబందుల్లా వీఆర్వోలు రాజ్యమేలే కాలం దాపురించబోతున్నదని ప్రజల్లో అనుమానం మొదలైంది. కొత్త బిల్లులో ఎమ్మార్వోలు, ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లకు విచక్షణాధికారాలను కట్టబెట్టారు. ఆర్వోఆర్ చట్టం-2020 ముందు వరకు అధికారులకు ఈ విచక్షణాధికారాలు ఉండేవి. ఈ వెసులుబాటును అడ్డుపెట్టుకొని వారు ప్రజలను పీడిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తడంతో నాటి కేసీఆర్ ప్రభుత్వం సమగ్రంగా వివరాలు సేకరించింది. ఆ ఆరోపణల్లో వాస్తవం ఉన్నట్టు తేలడంతో రెవెన్యూ అధికారుల విచక్షణాధికారాలను తొలగించి, కలెక్టర్‌కు మాత్రమే అధికారాలు కల్పించింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ఎమ్మార్వోలు, ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లకు విచక్షణాధికారాలను కట్టబెట్టడంతో కొత్త చట్టం 'పాత సీసాలో కొత్త సారా' అన్నట్టుగా ఉన్నదని నిపుణులు ఎద్దేవా చేస్తున్నారు. 1971 నాటి ఆర్వోఆర్ చట్టాన్నే మళ్లీ అమలు చేస్తున్నారని విమర్శిస్తున్నారు. అప్పట్లో కంప్యూటర్ రికార్డులు లేవని, ఇప్పుడు డిజిటల్ టెక్నాలజీని వినియోగిస్తున్నారే తప్ప ఈ రెండింటి మధ్య పెద్దగా తేడాలు లేవని పేర్కొంటున్నారు.

భూమి అమ్మేముందు సర్వే

- కొత్త చట్టంలో తప్పనిసరి చేసిన ప్రభుత్వం
- ప్రతి భూ కమతానికి 'భూదార్'
- పాస్ బుక్‌లో భూముల మ్యాప్
- 'రిజిస్ట్రేషన్ కాగానే మ్యుటేషన్'
- వారసత్వ భూముల మ్యుటేషన్‌కు మాత్రం గడువు
- అసైన్డ్ భూములకు పాస్ పుస్తకాలు మంజూరు

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త రెవెన్యూ చట్టం 'భూ భారతి'తో రెవెన్యూ రికార్డుల నిర్వహణలో అనేక మార్పులు జరగనున్నాయి. రాష్ట్రంలోని ప్రతి భూ కమతానికి ఆధార్ తరహాలో 'భూదార్' నంబర్‌ను కేటాయించనున్నారు. ఇకపై భూ క్రయవిక్రయాలు జరిపే సమయంలో ముందుగా ఆ భూమిని సర్వే చేయించాల్సి ఉంటుంది. ఆ తర్వాతే రిజిస్ట్రేషన్ జరుగుతుంది. ధరణి పోర్టల్‌లో అందుబాటులో ఉన్న 'ఇన్‌స్టంట్ మ్యుటేషన్'ను కొత్త చట్టంలోనూ కొనసాగించారు. క్రయవిక్రయాల సమయంలో రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక మ్యుటేషన్ కూడా పూర్తవుతుంది. కానీ, వారసత్వంగా జరిగే భూముల బదిలీ (ఫౌతీ)లో కొత్త నిబంధన తీసుకొచ్చారు. తాసిల్దార్ ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్ జరిగినా.. మ్యుటేషన్ చేసే అధికారాన్ని మాత్రం ఆర్డీవోకు అప్పగించారు. నిర్ణీత కాలంపాటు (30 రోజులు) మ్యుటేషన్ చేయకుండా నిలిపివేస్తారు. ఆలోగా ఆ భూమిపై ఎలాంటి ఫిర్యాదులు రాకపోతే ప్రక్రియ పూర్తి చేస్తారు. కోర్టు ద్వారా వచ్చే, ఓఆర్సీ, 38-ఈ తదితర మొత్తం 14 రకాల భూమి హక్కులపై మ్యుటేషన్ అధికారాలను ఆర్డీవోకు కట్టబెట్టారు. ఇప్పటివరకు ధరణి పోర్టల్‌లో మొత్తం 33 మాడ్యూళ్లు ఉండగా.. భూభారతిలో వాటిని 6కు తగ్గించనున్నారు. భూమి పట్టాలో కేవలం రైతు పేరు మాత్రమే ఉండగా.. ఇకపై అనుభవదారు కాలమ్ సహ మొత్తం 11 కాలమ్‌లు ఉంటాయి. పార్ట్-బీ కేసులు పరిష్కారమైనవారి వివరాలను భూ రికార్డుల్లో ఎక్కించి, పాస్ బుక్ ఇచ్చేలా మార్పులు చేశారు. తాసిల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్లకు అధికారం ఇచ్చారు. సాదాబైనామాల క్రమబద్ధీకరణ చేస్తామని ప్రభుత్వం తెలిపింది. గ్రామ కంఠం, ఆబాదీలకు హక్కుల రికార్డును రూపొందిస్తుంది. 2014 వరకు సబ్ రిజిస్ట్రార్ల వద్ద రికార్డుల్లో ఉన్న 'ప్రభుత్వ భూముల' వివరాలను ప్రస్తుతం ధరణిలో ఉన్న డాటాతో సరిపోల్చనున్నట్టు ప్రభుత్వం చెప్తున్నది. ఆయా సర్వే నంబర్లలోని భూములన్నింటినీ ప్రభుత్వ భూములుగా పరిగణించి నిషేధిత జాబితాలో చేర్చుతామని తెలిపింది. దీంతో 2014కు ముందు పొరపాటున ప్రభుత్వ భూమిగా నమోదై.. 2014 తర్వాత వివాదం ముగిసి, పట్టాభూమిగా మారిన భూములన్నీ ఇప్పుడు మళ్లీ నిషేధిత జాబితాలోకి చేరనున్నాయి. కొత్త రెవెన్యూ చట్టానికి సంబంధించిన నియమ నిబంధనలను 3 నెలల్లో తీసుకురానున్నారు.

భూ సమస్యలకు పరిష్కారం

కొత్త రెవెన్యూ చట్టాన్ని స్వాగతిస్తున్నామని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ తెలిపింది. ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వీ లచ్చిరెడ్డి, కే రామకృష్ణ బుధవారం అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భూ భారతి చట్టంతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని, రైతుల భూములతోపాటు ప్రభుత్వ భూములకు భద్రత చేకూరుతుందని, సాదాబైనామా దరఖాస్తులు పరిష్కారమవుతాయని అన్నారు. గ్రామ కంఠం, ఆబాదీలకు రికార్డులు వస్తాయన్నారు. కొత్త రెవెన్యూ చట్టాన్ని తెచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ తాసిల్దార్స్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ రాములు, రమేశ్ పాల్గొన్నారు.

కొత్త చట్టాన్ని స్వాగతిస్తున్నాం

నూతన ఆర్వోఆర్ చట్టాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) తెలిపింది. ఈ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సందర్భంగా ట్రెసా అధ్యక్ష, కార్యదర్శులు వంగా రవీందర్‌రెడ్డి, గౌతమ్ కుమార్ బుధవారం అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కొత్త రెవెన్యూ చట్టం త్వరగా అమల్లోకి రావాలని ఆకాంక్షించారు. దీని వల్ల పట్టాదారుల సమస్యలు కింది స్థాయిలోనే పరిష్కారమవుతాయని, అప్పీల్ వ్యవస్థ కారణంగా కోర్టులపై కూడా భారం తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో ట్రెసా నాయకులు రాజ్‌కుమార్, నిరంజన్, రమణ్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, తారక్ పాల్గొన్నారు.

మళ్లీ అనుభవదారు కాలమ్

- 2014కు ముందున్న కాస్తుదారులు రికార్డుల్లోకి..
- నాడు రైతుల మెడకు దూలం కట్టదలుచుకోలేదన్న కేసీఆర్
- ఇప్పుడు మళ్లీ కౌలుదారులకు 'భూ హక్కులు'

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): భూ రికార్డుల్లో అనుభవదారు కాలమ్‌ను రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ తెరపైకి తెచ్చింది. రైతుల భూమి హక్కులను కాపాడుతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి 'కాస్తు కాలమ్' పేరుతో రైతులపై పిడుగు వేయనున్నది. గతంలో అనుభవదారు కాలమ్ వల్ల ఎంతో మంది రైతుల తలరాతలు తలకిందులైన విషయం తెలిసిందే. కౌలుదారులు తొలుత భూ రికార్డుల్లోని అనుభవదారు కాలమ్‌లో పేరు నమోదు చేయించుకుని, ఆ తర్వాత రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఏకంగా పట్టాలనే తమ పేరిట మార్పించుకునేవారు. ఆ విషయం నిరక్షరాస్యులైన రైతులకు చాలా కాలంపాటు తెలియకపోయేది. ఏదైనా అత్యవసరం వల్ల భూములు అమ్మేందుకు ప్రయత్నించినప్పుడే అసలు విషయం బయటపడేంది. దీంతో పంచాయితీలు, వివాదాలు, ఘర్షణలు తలెత్తి నేరాలకు దారితీసేవి. ఫలితంగా పోలీస్ స్టేషన్లు, కోర్టులు, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగి రైతులు తమ సర్వస్వాన్ని కోల్పోయేవారు. దున్నుకొని బతకమని భూమిని కౌలుకు ఇస్తే ఆ భూమినే మింగేశారంటూ లబోదిబోమనేవారు. వివాదాల్లో ఉన్న భూమి అంటూ అగ్గువకు అమ్ముకొనేవారు. ఈ దుస్థితి నుంచి రైతులకు విముక్తి కల్పించేందుకు గతంలో కేసీఆర్ ప్రభుత్వం 2020 ఆర్వోఆర్ చట్టాన్ని అమలు చేసే సమయంలో అనుభవదారు కాలమ్‌ను రద్దు చేసింది. భూ రికార్డుల్లో కేవలం రైతు మాత్రమే ఉంటారని స్పష్టం చేసింది. దీంతో దొంత పట్టాలకు అవకాశం లేకుండా పోయింది. కౌలు రైతులను గుర్తించాలని ఓ సందర్భంలో ప్రతిపక్షాలు అసెంబ్లీలో అడగడంతో.. 'కౌలుదారులను గుర్తించం. రైతు మెడకు మళ్లీ దూలం కట్టదలుచుకోలేదు' అని నాటి సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. కానీ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అనుభవదారు కాలమ్‌ను తీసుకొచ్చి రైతుల మెడకు మళ్లీ గుదిబండ కట్టేందుకు సిద్ధమైంది. 2014కు ముందు రికార్డుల్లో అనుభవదారు కాలమ్‌లో ఉన్నవారి పేర్లను మళ్లీ భూ రికార్డుల్లో చేరుస్తామని చెప్పింది. గతంలో మాన్యువల్ పహాణీల్లో గజిబిజిగా 32 కాలమ్‌లు ఉండేవి. ప్రస్తుత పరిస్థితులకు అవి అవసరం లేకపోవడంతో కేసీఆర్ ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. ధరణిలో వ్యవసాయ భూమా? కాదా? అనే ఏకైక కాలమ్‌ను ఉంచింది.

భూ హక్కుల పరిరక్షణకే భూభారతి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): రైతుల భూ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా భూభారతి చట్టాన్ని రూపొందించినట్టు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీలో తెలిపారు. ఆర్వోఆర్ -24 చట్టాన్ని బుధవారం అసెంబ్లీలో మంత్రి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్వోఆర్ -2020ని పూర్తిగా ప్రక్షాళన చేసి భూభారతిని రూపొందించినట్టు చెప్పారు. ధరణి స్థానంలో భూభారతిని ప్రవేశపెడుతున్నట్టు ప్రకటించారు. ఆగస్టు 2న ముసాయిదాను విడుదల చేసి, 40 రోజులపాటు వెబ్‌సైట్‌లో పెట్టి సూచనలు, సలహాలు స్వీకరించినట్టు తెలిపారు. బీఆర్‌ఎస్ సభ్యుల నుంచి వచ్చిన సూచనలు, సలహాలను సైతం పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. భూభారతి నిర్వహణను నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెల్ (ఎన్ఐసీ)కు అప్పగించినట్టు తెలిపారు. రహస్యాలకు తావు లేకుండా సామాన్యులకు ఉపయోగపడేలా ఈ వెబ్‌సైట్‌ను రూపొందించామని స్పష్టం చేశారు.

మళ్లీ పనిచేయని ధరణి పోర్టల్

పెగడపల్లి, డిసెంబర్ 18: రాష్ట్రవ్యాప్తంగా ధరణి పోర్టల్ మళ్లీ నిలిచింది. బుధవారం సేవలు నిలిచిపోవడంతో భూముల రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్‌ల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రభుత్వం ధరణి పోర్టల్ సవరణలో భాగంగా 12 సాయంత్రం 5 నుంచి 16వ తేదీ ఉదయం వరకు డాటా బేస్ అప్‌గ్రేడ్ ప్రక్రియను చేపట్టింది. 16వ తేదీ నుంచి సేవలు యథావిధిగా ప్రారంభం కాగా, ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,785 మంది రైతులు స్లాట్ బుక్ చేసుకోగా, 1,402 మంది భూములను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

భూభారతి బిల్లుపై చర్చకు సమయమివ్వండి: అక్బరుద్దీన్

భూభారతి బిల్లుపై చర్చించేందుకు సమయం ఇవ్వాలని ఎంఐఎం సభ్యుడు అక్బరుద్దీన్ ఒవైసీ ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయం పూర్తికాకుండానే భూభారతి బిల్లును సభలో ప్రవేశపెట్టాలని మంత్రి పొంగులేటికి స్పీకర్ సూచించారు. దీంతో మంత్రి భూభారతి బిల్లును ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో మాజీమంత్రి హరీశ్‌రావు తరహాలోనే అక్బరుద్దీన్ కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. నియమాలకు విరుద్ధంగా బిల్లును ప్రవేశపెట్టడంపై నిలదీశారు.

పదేండ్ల కిందటి జంజాటమే!

- గురువు బాటలో శిష్యుడు రేవంత్
- చంద్రబాబు భూధార్ ఐడియా కాపీ
- 'భూభారతి'పై నెటిజన్ల విమర్శలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ స్థానంలో 'భూభారతి'ని తీసుకొస్తున్నట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన ప్రకటనపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూరికార్డులకు సంబంధించి ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ఎదుర్కొన్న సవాళ్లను ఇప్పుడు మళ్లీ ఎదుర్కోవాల్సి వస్తుందని, పదేండ్ల క్రితంనాటి జంఝాటం మళ్లీ పునరావృతమవుతున్నదని పలువురు నెటిజన్లు మండిపడుతున్నారు. భూభారతితో గ్రామాల్లో మళ్లీ వీఆర్వోల రాజ్యమేలడం ఖాయమని, చేతులు తడపనిదే పనులు జరగని రోజులు మళ్లీ రాబోతున్నాయని రమేశ్ అనే ఓ నెటిజన్ కామెంట్ చేశారు. భూభారతితో రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తమయ్యే పరిస్థితి రావొచ్చని వినీత్ అనే మరో నెటిజన్ ఆందోళన వ్యక్తం చేశారు. పట్టాదారు పాస్‌పుస్తకం ఉండగా మళ్లీ భూధార్ కార్డు ఎందుకని రాజు గౌలుసుల అనే మరో నెటిజన్ ప్రశ్నించారు. దీని వల్ల డబ్బు, సమయం వృథా కావడమే తప్ప ఒరిగేదేమీ ఉండదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

చంద్రబాబు బాటలో రేవంత్‌రెడ్డి

ఏపీలోని చంద్రబాబు ప్రభుత్వం 2018లో భూధార్ భరోసా పేరిట భూధార్ కార్డులను తీసుకొచ్చిందని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అదే ఐడియాను కాపీ కొట్టిందని పలువురు నెటిజన్లు విమర్శిస్తున్నారు. గురువు బాటలో శిష్యుడు ప్రయాణిస్తున్నాడంటూ అప్పటి వీడియోలను పోస్ట్ చేస్తూ ట్రోల్ చేస్తున్నారు.

ట్రిబ్యునళ్ల ఏర్పాటు జరిగేనా?

- ఎప్పటిలోపు ఏర్పాటు చేస్తారో చెప్పని ప్రభుత్వం
- వికేంద్రీకరణ అంటూనే అధికారాల కేంద్రీకరణ
- ప్రభుత్వ భూములపై సీసీఎల్‌ఏకి సర్వాధికారాలు



హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): భూ వివాదాలపై రెవెన్యూ విచారణను కొత్త ఆర్వోఆర్ చట్టంలో వికేంద్రీకరిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పినప్పటికీ కీలకమైన అంశాలను మాత్రం మరింత కేంద్రీకృతం చేసింది. ముఖ్యంగా సీసీఎల్‌ఏకి సర్వాధికారాలు కట్టబెట్టినట్టు కనిపిస్తున్నది. నూతన ఆర్వోఆర్ చట్టం ప్రకారం ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేస్తామని చెప్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. వాటిని ఎప్పటిలోగా ఏర్పాటు చేస్తారో వెల్లడించడం లేదు. అప్పటివరకు ట్రిబ్యునల్ అధికారాలు సీసీఎల్‌ఏకే ఉంటాయని ప్రభుత్వం చెప్తుండటంతో అసలు ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేస్తారా? లేదా? అన్న ప్రశ్న తలెత్తుతున్నది. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సీసీఎల్‌ఏ సుమోటోగా విచారణ జరుపవచ్చని, ఎవరైనా ఫిర్యాదు చేసి నా స్వీకరించవచ్చని పేర్కొన్నది. రాష్ట్రంలో దేవాదాయ శాఖ, వక్ఫ్, భూదాన్, అసైన్డ్, లావుణి పట్టా భూ ములు సహా లక్షల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. వీటన్నింటిపై విచారణ జరిపే అధికారాన్ని ఒక్క సీసీఎల్‌ఏకే కట్టబెట్టడం అధికారాలను కేంద్రీకరించినట్టు అవుతుందని నిపుణులు విమర్శిస్తున్నారు. అలా కాకుండా కొన్ని అధికారాలను జిల్లా కలెక్టర్లకో, ట్రిబ్యునళ్లకో అప్పగిస్తే బాగుంటుందని సూచిస్తున్నారు.

10 నెలల్లోనే అన్నీ ఎలా చేస్తాం?

గ్యారెంటీల అమలుకు ఇంకా సమయముంది: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, డిసెంబర్18 (నమస్తే తెలంగాణ): 'ఇచ్చిన హామీలన్నీ 10నెలల్లోనే ఎలా అమలు చేస్తాం? మాకు ఇంకా సమయముంది.. ఐదేళ్లలో తప్పకుండా గ్యారెంటీలన్నీ అమలు చేస్తాం'' అని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. శాసనసభలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ బిల్లులు చెల్లించాలంటే 10శాతం కమీషన్ తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుని ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించారు. వాటిని రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్‌ను కోరారు.